ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
గురువారం 31 అక్టోబరు 2024



రేపటి నుంచి 'పది' ప్రత్యేక తరగతులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు నవంబరు 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు తరగతులు ఉంటాయని, డిసెంబరు 31 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. చలికాలం కావడం, దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు అల్పాహారం చేయకుండా వచ్చి ఇబ్బందులకు గురవుతారని అభ్యంతరం వ్యక్తం కావడంతో ఉదయం వేళ నిర్వహించడం లేదు.

మెదక్ ఇక ముడా

- మెదక్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- మారనున్న పట్టణ రూపురేఖలు



మెదక్ పట్టణ వ్యూ

మెదక్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మెదక్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీలతో పాటు 289 రెవెన్యూ గ్రామాలు ముడా పరిధిలోకి రానున్నాయి. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా మెదక్, రామాయంపేట ముడా పరిధిలో ఉండనున్నాయి. నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలు ఇప్పటికే హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. వీటిని మినహాయించి మిగిలిన మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను ముడాలోకి తీసుకొచ్చారు. ముడాకు ప్రస్తుతానికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పలు ప్రభుత్వ విభాగాల అధికారులు సభ్యులుగా ఉండనున్నారు.

ముడా నిధులతో పట్టణాభివృద్ధి

ముడా నిధులను వెచ్చిస్తే పట్టణాల రూపురేఖలు మారనున్నాయి. ఇటీవల కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీర్లు రూ.84 కోట్ల అంచనాలతో మెదక్ పట్టణాభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశారు. మల్లంచెరువు సుందరీకరణ, అధునాతన పార్క్, స్వాగత తోరణాల నిర్మాణం అందులో మెతుకుసీమను గుర్తుకుతెస్తూ బియ్యపుగింజ చిత్రంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేయనున్నారు. చారిత్రాత్మక మెదక్ ఖిల్లాపై సందర్శకుల కోసం లేజర్‌షో ఏర్పాటు చేయనున్నారు. నిధుల సరిపోక పట్టణ శివారులో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు నిలిచిపోయాయి. మరో రూ.2 కోట్లు కేటాయిస్తే పూర్తవుతుంది. పట్టణంలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పిల్లర్ల స్టేజీలోనే నిలిచిపోయింది. అంచనా వ్యయం పెరగడంతో ఇంకా రూ.7.02 కోట్లు వెచ్చిస్తేనే పనులు పూర్తవుతాయి. గతంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో స్లాటర్‌హౌజ్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. నిధులను మంజూరు చేస్తే పనులు ప్రారంభించవచ్చు.

పొరపాట్లకు తావులేకుండా సర్వే చేపట్టాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక సర్వే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభించాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేకూరేలా కొత్త చట్టాలు : ఎస్పీ

మెదక్ అర్బన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : బాధితులకు మరింత న్యాయం చేకూరేలా కొత్త చట్టాలు ఉన్నాయని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కొత్త చట్టాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యాఅధినియంపై జిల్లాలోని పోలీసు అధికారులకు, సిబ్బందికి ఇది వరకే శిక్షణ ఇచ్చామన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో, శిక్షలో మార్పు వస్తుందన్నారు.

మార్కెట్లకు పండుగ కళ

- లక్ష్మీపూజ, దీపారాధనకు ఏర్పాట్లు పూర్తి
- ఆకాశాన్నంటిన పూలు, టపాసుల ధరలు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా మార్కెట్లలో దీపావళి సందడి నెలకొన్నది. ప్రమిదలు, పూలు, పూజ సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సంగారెడ్డి పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్, బైపాస్ రోడ్డు, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా పూలు, వివిధ రకాల బొమ్మలు, దీపాంతాలు తాత్కాలిక విక్రయ దుకాణాలు వెలిశాయి. వివిధ ఆకృతిలోని దీపాంతాలు, బొమ్మలు పలువురిని ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా పూలు, టపాసుల ధరలు ఆకాశాన్నంటాయి. గతంలో బంతిపూలు కిలో రూ.60 ఉండగా రూ.200 వరకు విక్రయించారు. వ్యాపార కేంద్రాలు, గృహాల్లో లక్ష్మీపూజకు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఇప్పటికే వ్యాపార కేంద్రాలను, చిరువ్యాపారుల దుకాణాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అగ్నిమాపక నిబంధనల మేరకు మైదానాలలో, నివాసాలకు దూరంగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. టపాసుల ధరలు భగ్గుమన్నాయి. రెండు వేల రూపాయలు వెచ్చించినా సరిపోను టపాసులు రావడం లేదు.



దీపాంతాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

363 టపాసుల దుకాణాలకు అనుమతి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 398 టపాసుల దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా బుధవారం సాయంత్రం వరకు 363 దుకాణాలకు అనుమతి ఇచ్చామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. నిబంధనలు పాటించని 32 టపాసుల దుకాణాల దరఖాస్తులు తిరస్కరించినట్లు పేర్కొన్నారు.



విక్రయానికి సిద్ధంగా వివిధ రకాల బొమ్మలు

బీసీ ప్రజాభిప్రాయ సేకరణకు

కలెక్టర్ల గైర్హాజరు బాధాకరం

- సిద్దిపేట, మెదక్ కలెక్టర్లపై ప్రభుత్వానికి ఫిర్యాదు
- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్
- స్వాగతం పలుకనందున సంగారెడ్డి కలెక్టర్‌పై అసహనం

8



సంగారెడ్డి కలెక్టరేట్‌లోని నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

లారీని ఢీకొట్టిన బైక్.. మహిళ మృతి


మృతిచెందిన సవిత


సునీల్‌కుమార్(ఫైల్)

అల్లాదుర్గం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందగా, ఆమె భర్త, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని పెద్దగౌరారం గ్రామానికి చెందిన కోరుబోయిన అంజయ్య హైదరాబాద్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆయన చిన్నమ్మ మరణించడంతో భార్య సవిత(35)తో కలిసి ఈ నెల 27న అంత్యక్రియల కోసం స్వగ్రామానికి వెళ్లాడు. బుధవారం భార్య, అన్న కుమారుడు శరణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా అల్లాదుర్గం సమీపంలోని 161వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో బైక్ లారీని బలంగా ఢీకొట్టింది. సవిత అక్కడికక్కడే మృతిచెందగా, అంజయ్య, శరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి పెదనాన్న భోజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు

నీటమునిగి యువకుడు..

పెద్దశంకరంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దశంకరంపేటకు చెందిన నాందేడ్ సునీల్‌కుమార్, అతని స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం సాయంత్రం కమలాపూర్ గోపాల చెరువు వద్ద మద్యం తాగారు. అనంతరం వారు చెరువులో ఈతకు దిగగా.. సునీల్ కుమార్ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సునీల్‌కుమార్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● ఇద్దరికి తీవ్రగాయాలు

బైక్ అదుపుతప్పి వ్యక్తి..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దశంకరంపేట ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాలు ప్రకారం.. రేగోడు మండలం పెద్దతండాకు చెందిన మెగావత్ రమేష్, బాచేపల్లితండాకు చెందిన సురేష్ బుధవారం పెద్దశంకరంపేట నుంచి రేగోడుకు బైక్‌పై వెళ్తున్నారు. మల్కాపూర్ చౌరస్తాకు రాగానే బైక్ అదుపు తప్పి ముందు ఉన్న ఇనుప మెట్లను ఢీకొట్టడంతో రమేష్(46) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన సురేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన జానకీరాంసాగర్ గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

బిలాల్‌పూర్‌లో పౌరహక్కుల అవగాహన

కోహీర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో సోమవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్ పౌరహక్కులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి తదితర ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. తక్కువ చేసి ఏ ఒక్కరి పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. కుల, మతాల పేరుతో ఎలాంటి సమస్యలు సృష్టించరాదని పేర్కొన్నారు.

ఆర్ఐటీ విద్యార్థుల 3కే రన్

హత్నూర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని మండల పరిధిలోని తుర్కలఖానాపూర్ గ్రామశివారులో గల రత్నపురి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 3కే నిర్వహించారు. కళాశాల నుంచి మల్కాపూర్ చౌరస్తా వరకు రన్ కొనసాగింది.



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు

బీసీ ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ల గైర్హాజరు బాధాకరం

- సిద్దిపేట, మెదక్ కలెక్టర్లపై ప్రభుత్వానికి ఫిర్యాదు..
- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్
- స్వాగతం పలుకనందున సంగారెడ్డి కలెక్టర్‌పై అసహనం

సంగారెడ్డి టౌన్ / సంగారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి మెదక్, సిద్దిపేట కలెక్టర్లు గైర్హాజరు కావడం బాధాకరమని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బీసీ కమిషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థలవారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లను డామాషా ప్రకారం జరారు చేసే అంశంపై సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు, మెదక్, సిద్దిపేట అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు హాజరుకాకపోవడంపై కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆక్షేపించారు. వారిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. అంతకుముందు సంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకున్న బీసీ కమిషన్ బృందానికి కలెక్టర్ క్రాంతి వల్లూరు స్వాగతం పలకకపోవడంతో చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకు కమిషన్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకే బీసీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. త్వరలో కుల గణన చేపట్టనున్నామని, బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మెంచు నగేష్, ఎండీ హమీద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, బీసీ కుల సంఘాల నాయకులు పట్నం మాణిక్యం, పులిమామిడి రాజు, బీరయ్య యాదవ్, నాగరాజు గౌడ్, ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్, టీఎన్‌జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

వెలుగుల పండగ.. కారాదు చీకటి..

- టపాసులతో జర భద్రం.. ● కాల్చే ముందు జాగ్రత్తలు తప్పనిసరి

మెదక్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండగ వచ్చిందంటే చాలు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ఈ సంతోషంలో అజాగ్రత్త, చిన్న చిన్న తప్పులతో టపాసులు పేల్చుతూ ప్రమాదాలబారిన పడి జీవితాన్ని అంధకారం చేసుకుంటుంటారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.



జాగ్రత్తలివే..

టపాసులు కాల్చే సమయంలో ప్రమాదవశాత్తు మంటలు రాజుకుంటే వెంటనే ఆర్పడానికి పక్కనే బకెట్లలో నీళ్లు నింపి పెట్టుకోవాలి. పిల్లలు, పెద్దలు అందరు కాటన్ దుస్తులు వేసుకోవడం మంచిది. ఒక వేళ ఒంటిపై అగ్గి పడి మంటలు వస్తే దుప్పటి కప్పి మంటలు ఆర్పడం ఉత్తమం. ఫైర్ స్టేషన్ నంబర్ అందుబాటులో ఉంచుకోవాలి. పిల్లల చెవులలో కాటన్ పెట్టడం మరువకూడదు. ఎందుకంటే పిల్ల కర్ణభేరికి పెద్ద చప్పుడు తట్టుకొనే శక్తి ఉండదు. డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువులలో, చేతిలో పట్టుకొని, ఇంటిలోలపల కాల్చడం వంటివి చేయకూడదు. సగం కాలిన తర్వాత, కాలి ఆగిపోయాక పిల్లలు దగ్గరకు వెళ్లి ముట్టడం లాంటివి చేస్తుంటారు. ముందుగా వాటిపై నీళ్లు పోసి చల్లార్చిన తర్వాతనే దగ్గరకు వెళ్లాలి. అధిక రక్త పోటు, హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులు పటాసుల చప్పుడుకు దూరంగా ఉండాలి. బాణాసంచా కాల్చిన తర్వాత చేతులను పరిశుభ్రంగా కడిగిన తర్వాతే ఆహారపదార్థాలు తినాలి. ఒక వేళ గాయాలైతే వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలి.

ప్రథమ చికిత్స ఇలా చేయాలి...

ఒక వేళ ప్రమాదం జరిగితే వెంటనే చేసుకొనే ప్రథమచికిత్సపై అవగాహన కలిగి ఉండాలి. ప్రమాదానికి గురైన వ్యక్తిని వెంటనే అగ్నికి దూరంగా ఉంచాలి. మంట అంటుకున్న చోట బట్టలను తొలగించాలి. ఇన్ఫెక్షన్ కాకుండా రుద్దడానికి బర్నాల్, దూది, అయోడిన్, టించర్, డెట్టాల్ లాంటివాటిని అందుబాటులో ఉంచుకోవాలి. ఒక వేళ గాయం పెద్దదిగా ఉంటె వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. గాయాలపై ఐస్ తో మర్దన చేయకూడదు. వెన్న, గ్రీస్, పౌడర్, ఆయిల్ లాంటివి పూయకూడదు. వీటి వల్ల ఇన్ఫెక్షన్ పెరిగే అవకాశం ఉంది.

24 గంటలూ అందుబాటులో '108'

-108 స్టేట్ ఆపరేషన్స్ హెడ్ ఖలీద్



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : దీపావళి పండగను పురస్కరించుకొని 108 అంబులెన్స్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నట్లు 108 స్టేట్ ఆపరేషన్స్ హెడ్ ఖలీద్ తెలిపారు. దీపావళికి 8 నుంచి 15 శాతం వరకు అత్యవసర పరిస్థితులు పెరుగుతాయని అంచనా ఉందన్నారు. ప్రమాదం జరిగితే 108 సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలన్నారు. కాలిన గాయాలపై సాధారణ నీరు 10 నుంచి 20 నిమిషాలు పోయాలని సూచించారు. శుభ్రమైన గుడ్డతో గాయాలను కప్పి ఉంచాలన్నారు. పొగతో కేసులు సగటు కంటే అధికంగా ఈ సారి 138 నుంచి 150 అత్యవసర కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

పిడుగుపాటుకు 17 గొర్రెలు మృతి

జోగిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాకూరులో పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య గ్రామ శివారులోని చెన్నకేశవ ఆలయ సమీపంలో బుధవారం గొర్రెలను మేపుతున్నాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో గొర్రెలను ఓ చెట్టు కిందికి తోలి.. పక్కనే ఉన్న ఆలయ ప్రాంగణంలోకి అతడు వెళ్లాడు. అంతలోనే ఆ చెట్టుపై పిడుగు పడడంతో 17 గొర్రెలు మృతి చెందాయి.

బుడ్డాయిపల్లిలో ఎండు గంజాయి పట్టివేత

వట్‌పల్లి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయిపల్లి గ్రామంలో బుధవారం 300 గ్రాముల ఎండు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన గోపాల్ వద్ద లభించిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు.

గుడిసె దగ్ధం.. తప్పిన ప్రాణాపాయం

తూప్రాన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్‌లో నివాసగుడిసె దగ్ధం కాగా తల్లి, కూతురు పక్కింట్లో పడుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.గ్రామానికి చెందిన ఎర్ర బూదమ్మ భర్త అంజయ్య చనిపోగా, దివ్యాంగురాలైన కూతురుతో కలిసి పూరిగుడిసెలో నివసిస్తుంది. బుధవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి గుడిసె దగ్ధమైంది. పక్కింట్లో పడుకోవడంతో తల్లీకూతుళ్లకు ప్రాణాపాయం తప్పింది. అయితే గుడిసెలో సామగ్రి మొత్తం బుగ్గిపాలవవడంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. మాజీ ఉపసర్పంచ్ అంజనేయులుగౌడ్ ఆర్థికసాయం అందించారు.

రూ.19కోట్లతో మూడు సబ్‌స్టేషన్‌లు

పటాన్‌చెరు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు శివారు గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రూ.19కోట్లతో మూడు అదనపు సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరులోని బ్లాక్ కార్యాలయం ప్రాంగణం, రామేశ్వరంబండ, పోచారం గ్రామాల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాలను విద్యుత్ అధికారులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా జనావాసాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచేందుకు మూడు కొత్త సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. స్థలాలను పరిశీలించిన వారిలో ట్రాన్స్‌కో డీఈ భాస్కర్‌రావు, ఏడీ దుర్గాప్రసాద్, తహసీల్దార్ రంగారావు, రామేశ్వరం బండ మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి తదితరులున్నారు.

రూ.10.40కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

పటాన్‌చెరు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు బుధవారం ప్రత్యేక సమావేశంలో కౌన్సిల్ ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వార్డుల్లోని పలు సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. ప్రాధాన్యతక్రమంలో నిధులను కేటాయించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.ఇటీవలే మున్సిపల్‌లో విలీనమైన ఆరు గ్రామాలలో సమస్యలపై చర్చించి తక్షణం చేపట్టాల్సిన పనులకు నిధులను కేటాయించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆర్‌వో మధుసూదన్‌రెడ్డి, డీఈ వెంకటరమణ, ఏఈలు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మెదక్ ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటాలి: డీఈవో

పాపన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో మెదక్ జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటాలని మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ సూచించారు. పాపన్నపేటలో రెండు రోజులుగా జరిగిన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండో రోజు జరిగిన బాలికల కబడ్డీ పోటీల్లో అండర్ 17 విభాగంలో కౌడిపల్లి మండలం మొదటి స్థానం, కొల్చారం రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇక అండర్ 14 విభాగంలో చేగుంట మొదటి స్థానం, కొల్చారం ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి రమేష్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని ప్రతిభను కనబర్చారు. జిల్లా నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన చిన్నారులను అమూల్యమ్మ అభినందించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ స్విమ్మింగ్ కోచ్ శేషుకుమార్ తెలిపారు.

'వ్యవసాయ కూలీలందరికీ పురావాసం కల్పించాలి'

జహీరాబాద్, అక్టోబరు 30: రైతులు నిమ్జ్‌లో వ్యవసాయభూములు కోల్పోతున్న నేపథ్యంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, రైతు కూలీలందరికీ పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాంచందర్ పేర్కొన్నారు. వ్యవసాయాధారిత కూలీలకు పునరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు, రైతుకూలీలకు అన్యాయం జరిగితే రోడ్డెక్కి ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మనోహర్, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి'

చేగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి ప్రశాంత్ డిమాండ్ చేశారు. చేగుంటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి గాంధీ చౌరస్తావద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు వంశీ, రామకృష్ణ, హరి, నవీన్, లక్ష్మి, ప్రియా, వర్ష, మనోజ్, శరణ్య, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ ఉద్యోగవిరమణ

చేగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం సూపర్ వైజర్ ఈశ్వరయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెటింగ్‌శాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం హాజరయ్యారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఈశ్వరయ్యను శాలువా పూలమాలతో సిబ్బందితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

మనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికిగాను రూ.3 కోట్ల 71 లక్షలతో జరిగిన పనులకు సంబంధించి బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించారు. 14వ విడత సామాజిక తనిఖీలు వివిధ గ్రామాల్లో నిర్వహించిన అనంతరం నిర్వహించిన ప్రజా వేదికలో పలు అవకతవకలు బహిర్గతం అయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వలస వెళ్లిన వారు పనులు చేయకున్నా వారి పేరిట పనులు చేసినట్లు చూపి బిల్లులు డ్రా చేసుకున్నట్టు తెలిసింది. చేసిన పనుల్లో తేడా వచ్చిందన్నారు. ఆదివారం సెలవు దినాల్లో పనులు చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రూ. లక్ష 14వేలు, రికవరీ చేస్తున్నట్లు అడిషనల్ డీఆర్డీవో బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, డీఈవో నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో అతివేలి మంగ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో రూ.4.49 లక్షల దుర్వినియోగం

నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా ఖేడ్‌మండలంలో 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం రాత్రి వరకు ఖేడ్ ఎంపీపీ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించగా, పంచాయతీలవారీగా తనిఖీ బృందాల వారు నివేదికలు సమర్పించారు. మండలంలోని 50 గ్రామ పంచాయతీలు ఉండగా, 16 గ్రామ పంచాయతీల్లో అక్రమాలు జరుగలేదని తనిఖీ అధికారులు తెలిపారు. మిగిలిన గ్రామ పంచాయతీల పరిధిలో రూ.4,49,888 దుర్వినియోగం అయినట్లు తేలిందన్నారు. దుర్వినియోగం అయిన నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పుల్‌కల్: వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి

పుల్‌కల్/జిన్నారం/కల్హేర్/టేక్మాల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముదిమాణిక్యం పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇసోజిపేట, మిన్‌పూర్, ముద్దాయిపేట, గొంగ్లూరు గ్రామాలలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డితో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఊట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం నరేందర్ ప్రారంభించారు. కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ సహకారం సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ క్రిష్ణాగౌడ్ ప్రారంభించారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఏఈవో మంజుల ప్రారంభించారు.

మెదక్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- సీఎంకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రాంత అభివృద్ధితోపాటు పలు శాఖల ద్వారా జరిగే అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు బుధవారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను సీఎంకు వివరించారు. సీఎంతో దాదాపు అరగంట పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోతున్న క్రమంలో నియంత్రణ కోసం నూతనంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేయాలన్నారు. అంతేకాకుండా కొత్త మండలాల్లో శాశ్వత పోలీసు స్టేషన్ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ఏడుపాయల అభివృద్ధి, మెదక్ చర్చి, ఖిల్లా, పోచారం అభయారణ్యం, కొంటూర్ చెరువు సుందరీకరణ, మినీట్యాంక్ బండ్, జిల్లా కేంద్రంలోని మూడు చౌరస్తాల సుందరీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

2న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నవంబరు 2న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్య ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నారం టీటీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో అండర్-17 బాలుర క్రికెట్ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 6281440401, 9505796688 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

అవినీతిని అంతం చేద్దాం


సంగారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అవినీతిని అంతమొందించి నీతి నిజాయితీ గల సమాజాన్ని ఏర్పాటు చేద్దామని టీజీఎస్‌పీడీసీఎల్ (ట్రాన్స్‌కో) విజిలెన్స్ సీఐ వెంకటేశ్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా బుధవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి జడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

నిర్ణీత గడువులోగా సామాజిక సర్వే పూర్తి చేయాలి

- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎన్యూమరేటర్లకు శిక్షణ

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక సర్వే నేపథ్యంలో ఎన్యూమరేటర్లకు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా పట్టణాలు, మండలాల్లో మున్సిపల్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలు, రైతు వేదికల్లో బుధవారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. నవంబరు 6నుంచి ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ఆర్థిక, విద్య, ఉపాధి, కుల గణనకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుంది. కాగా ప్రొఫార్మా ప్రకారం ఎలాంటి తప్పులు దొర్లకుండా వారి నుంచి సమగ్ర సమాచారాన్ని ఎలా సేకరించాలనే విషయాలకు సంబంధించి ఎన్యూమరేటర్లకు ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు. తమకు కేటాయించిన ప్రాంతంలో ఇళ్లకు వెళ్లి వారికి ముందస్తు సమాచారం ఇచ్చి సర్వేకు వచ్చినపుడు ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తిచేసి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్లకు అధికారులు సూచించారు.



నిజాంపేట: ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమంలో సర్వే అంశాలను వివరిస్తున్న మండల ప్రత్యేక అధికారి

ఆయా మండలాల్లో ...

నర్సాపూర్ పట్టణ పరిధిలో నిర్వహించే ఎన్యూమరేటర్లకు మున్సిపల్ కార్యాలయంలో, మండల పరిధిలో ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్లకు మండల పరిషత్ కార్యాలయంలో వేర్వేరుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పలు సూచనలు చేశారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిజాంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కుటుంబ సర్వే నమోదుపై ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, పీఆర్ ఏఈ శరత్ తదితర అధికారులు పాల్గొన్నారు. మనోహరాబాద్ మండలంలోని రైతు వేదికలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు సర్వే బృందంతో శిక్షణ సమావేశం నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి శిక్షణ కల్పించారు. చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో జిల్లా పశువైద్యాధికారి మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణ ఆధ్వర్యంలో కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయం తహసీల్దార్ కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించి శిక్షణ కల్పించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో వారికి కుటుంబ సర్వేకు సంబంధించి సూచనలు చేశారు.